నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 22 ఫిబ్రవరి 2025 SANGAREDDY

# అన్నదాతలను ఆదుకోవాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

- రైతుల ప్రయోజనాల దృష్ట్యా నీటిని పంపింగ్ చేయాలి
- పంటకాలం పూర్తయ్యేవరకు నీళ్లు అందించాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి రైతుల పక్షాన లేఖ

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 21 : సిద్దిపేట నియోజకవర్గంలో నాలుగేండ్ల నుంచి యాసంగి పంటకు రంగనాయకసాగర్ కాల్వల ద్వారా రైతుల పంట పొలాలకు సాగు నీటిని అందిస్తున్నామని, ఈ సారి యాసంగి పంటకాలం పూర్తయ్యే వరకు సాగునీటిని అందించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి రైతుల పక్షాన లేఖ ద్వారా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. నాలుగు సంవత్సరాల నుంచి సాగు నీరు రైతులకు అందించడం వల్ల పంట రాబడి పెరిగిందని లేఖలో పేర్కొన్నారు. రంగనాయకసాగర్ కింద ప్రతి ఏటా గణనీయంగా పంటరాబడి పెరుగుతుందన్నారు. ఈ ఏటా 50 వేల ఎకరాల పంట సాగులో ఉందని లేఖలో తెలిపారు. రంగనాయకసాగర్‌లో ఇటీవల 2.4 టీఎంసీల నీళ్లు పంపింగ్ చేశారని, ప్రస్తుతం రంగనాయకసాగర్‌లో 1.85 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. యాసంగి పంటకు పూర్తి స్థాయిలో నీరు అందాలంటే ఇంకా 2.5 టీఎంసీల నీరు అవసరం ఉందని తెలిపారు. మిడ్ మానేర్ నుంచి రెండు విడతలుగా రంగనాయకసాగర్‌లోకి నీళ్లు పంపింగ్ చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించాలని మంత్రికి హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. రైతులు సాగు నీళ్లు లేక తీవ్ర ఆందోళనలో ఉన్నారని, నాలుగు సంవత్సరాల నుంచి యాసంగికి రైతులకు సాగు నీరు అందించినట్లుగా ఈ యాసంగి పంటకాలం పూర్తయ్యేవరకు రైతుల పంట పొలాలకు సాగు నీరు అందించాలని సిద్దిపేట నియోజకవర్గ రైతుల పక్షాన నీటి పారుదల శాఖ మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు లేఖలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు.


T. HARISH RAO
M.L.A.
33-Siddipet Assembly Constituency

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు రాసిన లేఖ

# పశువులకు మేతగా వరి



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారులో నీళ్లు లేక ఎండిన వరిపంటను మేస్తున్న పశువులు

**సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారులో ఎండిన పంట**

కొమురవెల్లి, ఫిబ్రవరి 21 : 'తలాపున పారుతున్నది గోదావరి మన చేను మన చెలక ఎడారి' అని తెలంగాణ ఉద్యమ సమయంలో పాడుకున్న పాట కాంగ్రెస్ పాలనలో మరో సారి పాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం పరిస్థితి. మండలంలోని ఐనాపూర్ శివారులో ఉన్న తపాస్‌పల్లి రిజర్వాయర్ వల్ల రైతులకు ప్రయోజనం శున్యంగా మారింది. ఎండాకాలం ప్రారంభంలోనే గిట్ల పొలాలు ఎం డితే రేపు ఎండలు ము దిరితే పరిస్థితి ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని లెనిన్ నగర్‌లో దాసరి నాగేశ్ తనకున్న ఎకరంలో వరి పొలం సాగు చేశా డు. ఎండాకాలం ప్రారంభం కాకముం దే వరికి నీళ్లు అందకపోవడంతో పంటపై ఆశలు వదులుకున్న రైతు శుక్రవారం ఉదయం వరి పం టలో పశువులను వదిలాడు. బీఆర్ఎస్ పాలనలో లెనినగర్‌లో ఉన్న కుంటను తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా రెండు నుంచి మూడు సార్లు నింపేవారని, ఎండాకాలంలో సైతం కుంట నిండా నీళ్లు ఉంటుండంతో భూగర్భ జలాలు పెరిగి రెండు పంటలు పండించేవాళ్లమని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. గదే ఆశతో గీసారి పంట వేస్తే నీళ్లు వదలకపోవడంతో వేసిన పంటను పశువులకు వదిలిపెట్టినట్లు తెలిపారు.



నీళ్లు లేక సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారులో ఎండిన వరిపొలం

# కామన్ డైట్ మెనూ పాటించాలి



సిద్దిపేట మైనార్టీ బాలుర గురుకుల స్కూల్‌లో వంటలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

సిద్దిపేట, ఫిబ్రవరి 21: పాఠశాలలో తప్పకుండా కామన్ డైట్ మెనూ పాటించాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాల ప్రాంగణంలోని తరగతి గదులు, భోజనశాల, డార్మెటరీని తనిఖీ చేశారు. అనంతరం టెన్త్, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సలీం, ప్రిన్సిపాల్ భానుప్రకాశ్, మున్సిపల్ కమిషనర్ అశ్విత్ కుమార్, డీఎంహెచ్‌వో పల్వాన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 21: సిద్దిపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలోని ఏఆర్ గార్డెన్‌లో శుక్రవారం జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన మైనర్ అమ్మాయితో రేబర్తి గ్రామానికి చెందిన అబ్బాయితో బాల్య వివాహాన్ని జరిపిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, తహసీల్దార్ రహీం, ఎస్సై షేక్‌మహబూబ్, ఆర్‌ఐ రమే శ్, సూపర్‌వైజర్ పుష్పలత వివాహ మండపం వద్దకు వెళ్లి వివాహాన్ని నిలిపివేశారు. అమ్మాయికి 18 ఏండ్లు నిండలేదని అధికారులు ధ్రువీకరించి, అమ్మాయి, అబ్బాయిల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మేజర్లయిన తర్వాతే వివాహం జరిపిస్తామని ఇరువర్గాల నుంచి అధికారులు లిఖిత పూర్వకమైన హామీ పత్రాన్ని తీసుకున్నారు. బాల్య వివాహాలను జరిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.




డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా గుమ్మడిదల హైవేపై ర్యాలీ తీస్తున్న రైతు, మహిళా జేఏసీ నాయకులు

# డంపింగ్‌యార్డు ఉద్యమం ఉధృతం



గుమ్మడిదలలో 11వ రోజు రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న దార్గుల్లా గ్రామస్తులు, జేఏసీ అధ్యక్షుడికి విరాళం అందజేస్తున్న మంద చంద్రారెడ్డి



ప్యారానగర్ డంపింగ్‌యార్డులో హైకోర్టు ఆదేశాలతో సర్వే చేస్తున్న సర్వేయర్‌ను ప్రశ్నిస్తున్న రైతులు

- డంపింగ్‌యార్డు రద్దు కోసం మా ప్రాణాలను బలిపెడతాం
- 17 రోజుల నుంచి నిరవధికంగా ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా సర్కారు స్పందించదా..?
- రైతు జేఏసీ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి
- ప్యారానగర్ డంపింగ్ యార్డులో రాంకీ సంస్థకు అనుకూలంగా సర్వే చేస్తున్నారని ఆగ్రహం
- సర్వే విరమించకున్న రెవెన్యూ అధికారులు

గుమ్మడిదల,ఫిబ్రవరి21: డంపింగ్‌యార్డు రద్దు కోసం మా ప్రాణాలైన బలిపెట్టడానికి సిద్ధంగా ఉన్నామని రైతు జేఏసీ నాయకులు 17వ రోజు రిలే నిరాహార దీక్షలో ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి, ప్యారానగర్ గ్రామ శివారులో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టిన డంపింగ్‌యార్డు అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు జేఏసీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం 11వ రోజు దార్గుల్లా గ్రామస్తులు నల్లబ్యాడ్జీలు, నల్ల చొక్కలు ధరించి రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఇందులో రాయప్పరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, మహిళలు పాల్గొన్నారు. అనంతరం మహిళా జేఏసీ, రైతు జేఏసీ నాయకులు, యువకులు సంయుక్తంగా నల్లబ్యాడ్జీలు ధరించిన జాతీయరహదారి-765డీపై భారీ సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. హైవేపై బైఠాయించి ఆందోళనకు దిగారు. డంపింగ్ యార్డు వద్దురా.. జైజవాన్-జైకిసాన్ అంటూ నినదించారు. మహిళలు, పిల్లలు, యువకులు, రైతులు డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నిరసనలు చేస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు ఎందుకు స్పందించడం లేదని మహిళా జేఏసీ అధ్యక్షురాలు మల్లమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బైఠాయించిన నిరసనకారులను పోలీసులు విరమింపచేశారు. గుమ్మడిదలలో రిలే నిరాహారదీక్ష కొనసాగేందుకు మందచంద్రారెడ్డి జేఏసీ కమిటీకి రూ.20 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు చిమ్ముల నర్సింహారెడ్డి, రాజశేఖర్, జేఏసీ నాయకులు దేవేందర్‌రెడ్డి జైపాల్‌రెడ్డి, రమణారెడ్డి, రైతుసంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, రాంరెడ్డి, ఆంజనేయులుయాదవ్, ప్రవీణ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రవ ణ్, రాంరెడ్డి, మురళీ పాల్గొన్నారు.

**వినూత్నంగా రిలే నిరాహారదీక్ష**

ప్యారానగర్-నల్లవల్లిలో 17వ రోజు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఇందులో కొత్తపల్లి, నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాలకు చెందిన యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీక్షకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా డంపింగ్‌యార్డు వస్తే ఎవుసం ఎగిలిస్తది, పొయ్యిలో పిల్ల పడుకుంటది...గాలి, నీళ్లు తాగకుండా పనికిరాకుండా పోతాయి, ఇక్కడి గ్రామాల ప్రజలు వలస వెళ్లాల్సి వస్తదంటూ బుర్ర కథరూపంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

**రాంకీ సంస్థకు అనుకూలంగా సర్వే**

ఇటీవల హైకోర్టును ఆశ్రయించిన నలుగురు రైతులు డంపింగ్‌యార్డు భూముల్లో మా భూములు ఉన్నాయని, సర్వే చేసి చూపించాలని కోర్టులో పిటిషన్ చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా సర్వేయర్ ఏడీ ఐనేస్, డీఐ రాజు, మండల సర్వేయర్ యాదయ్య మరో నలుగురు కలిసి ప్యారానగర్ భూములను సర్వే చేయడం ప్రారంభించారు. దీనికి కోర్టును ఆశ్రయించిన రైతులు అక్కడికి చేరుకున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు చూపించిన హద్దుల నుంచి సర్వే చేయాలని రైతులు ఏడీని కోరారు. రైతులు, సర్వేయర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తున్న రాంకీ సంస్థకు అనుకూలంగా సర్వేచేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ గ్రామ మ్యాప్, టీపాన్, కాస్రా, పహాణీల ఆధారంగా సర్వే చేస్తున్నామని రైతులకు తేల్చి చెప్పారు. గతంలో చూపించిన హద్దుల ఆధారంగా సర్వే చేయాలని డిమాండ్ చేయడంతో సర్వేయర్ల బృందం వెనుతిరిగింది.

# కోర్టు తీర్పుకు విరుద్ధంగా డంపింగ్‌యార్డు ఏర్పాటు




నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

నర్సాపూర్, ఫిబ్రవరి21: ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే సుమారు రెండు వేల టన్నుల చెత్త జీహెచ్‌ఎంసీ నుంచి రానున్నదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్ పట్టణంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష ఐదోరోజుకు చేరుకుంది. రిలే నిరాహారదీక్షలో భాగంగా నర్సాపూర్ పట్టణానికి చెందిన విశ్రాంత ఉద్యోగులు శుక్రవారం దీక్షలో కూర్చున్నారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ నుంచి చెత్త తరలించడానికి సుమారు 200 నుంచి 250 టిప్పర్లు రోడ్లపై తిరుగుతాయని, దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే వర్షం పడ్డప్పుడు ప్రతి నీటి బొట్టు రాయారావు చెరువులోకి వస్తుందని, దీంతో చెరువు కాలుష్యమవుతుందన్నారు. డంపింగ్ యార్డు వల్ల దుర్గంధంతోపాటు గాలి, నీరు కలుషితమవుతాయన్నారు. జవహర్‌నగర్ ప్రాంతవాసులు కోర్టును ఆశ్రయించగా జీహెచ్‌ఎంసీ పరిధిలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసి చెత్తను తరలించాలని గతంలో కోర్టు తెలిపిందని, దీనికి విరుద్ధంగా ప్యారానగర్‌లో ప్రభుత్వం డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తుందని మండిపడ్డారు. గుమ్మడిదల మండలానికి చెందిన ప్రజలు డంపింగ్‌యార్డు వద్దని తీర్మానం చేసినప్పుడే బీఆర్ఎస్ ప్రభుత్వం ఆపేసిందని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ప్రారంభించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దుర్మార్గంగా వందలమంది ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేసి టిప్పర్లతో మట్టిని తీసుకువచ్చి పనులు ప్రారంభించిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని మానుకోవాలని లేదంటే ఈ పోరాటాన్ని ఆపేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, జేఏసీ నాయకులు రాజేందర్, షేక్ హుస్సేన్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో ముందుకు వెళ్తున్నాం



కార్యక్రమంలో పాల్గొన్న ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు, మార్వెల్ ప్రతినిధులు

- ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి
- కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో మార్వెల్ డేటా యాక్సిలరేషన్ రీసెర్చ్ ఫెసిలిటీ ప్రారంభం

కంది, ఫిబ్రవరి 21: సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో మార్వెల్ టెక్నాలజీ ప్రపంచంలోనే మొట్టమొదటి డేటా యాక్సిలరేషన్,అప్‌లోడ్ రీసెర్చ్ ఫెసిలిటీని శుక్రవారం ప్రారంభించారు. ఈ మార్గదర్శక కేంద్రం నెట్‌వర్క్ నిల్వ, భద్రతా సాంకేతికలను అభివృద్ధి చేసేందుకు, వేగవంతమైన మౌలిక సదుపాయాల పనితీరును మెరుగుపర్చేందుకు దోహదపడనున్నది. మార్వెల్ డేటా యాక్సిలరేషన్ అప్‌లోడ్ రీసెర్చ్ ఫెసిలిటీ విద్యార్థులు, పరిశోధకులు, పరిశ్రమల నిపుణులకు అత్యాధునిక సాంకేతికలను అందించనున్నది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ సాంకేతిక పరిశోధనలు, విద్యను అభివృద్ధి చేయడంలో ఐఐటీహెచ్ ఒక నిబద్ధతతో ముందుకు సాగుతుందన్నారు. వేగవంతమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సంస్థను ముందంజలో ఉంచుతామన్నారు. మార్వెల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ క్యారీ ఉస్సేరీ మాట్లాడుతూ మార్వెల్ ఐఐటీహెచ్ మధ్య భాగస్వామ్యం అకాడమియా-ఇండస్ట్రీ సహకార ప్రభావాన్ని చూపుతుందన్నారు. అత్యాధునిక సాంకేతికతలకు ప్రాధాన్యత, నెట్‌వర్క్ అభివృద్ధిని వేగవంతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ ప్రొఫెసర్లు, మార్వెల్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాక్ ఆధ్వర్యంలో ఇటుకల తయారీ

**శిక్షణను ప్రారంభించిన సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి**

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 21: స్వయం సహాయక సంఘాల మహిళలు ఇటుకల తయారీ, ఇండ్ల నిర్మాణం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం స్వయం సహాయక సంఘాల మహిళలకు న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ ఆవరణలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు సిమెంట్ ఇటుకల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల నుంచి మండలానికి ఐదుగురు చొప్పున న్యాక్ ఆధ్వర్యంలో మహిళలకు ఇటుకల తయారీ, ఇండ్ల నిర్మాణంపై శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో విడతలో 35 మందికి ఆరు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు.ఈ శిక్షణ ద్వారా గ్రామాల్లో ఎక్కడికక్కడ ఇటుకలను తయారు చేసే యూనిట్లను నెలకొల్పడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో తక్కువ ధరకు నాణ్యమైన సిమెంట్ ఇటుకలు అందుబాటులో ఉంటాయన్నారు. న్యాక్ ఏపీడీ రామ్, డీఆర్డీవో జ్యోతి, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి పాల్గొన్నారు.



ఇటుకల తయారీ శిక్షణను ప్రారంభిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

# తండా ప్రజలు సుభిక్షంగా ఉండాలి



సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాంబమాత ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

**ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి**

మెదక్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : తండా ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి స్వామివారిని వేడుకున్నారు. శుక్రవారం మెదక్ జిల్లా హవేళీ ఘన్‌పూర్ మండలం లింగ్సాన్‌పల్లితండాలో సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాంబ మాత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆయన్ని గ్రామ నాయకులు సాదరంగా ఆహ్వానించారు. ఆలయ ప్రాంగణంలో సేవాలాల్ ఆలయ పూజారుల సమక్షంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీకి పూజారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేయగా తండా ప్రజలు సత్కరించారు. ఆలయ పూజారి దుల్యానాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోపాల్‌రావు, మాజీ సర్పంచ్‌లు రమేశ్ నాయక్, శ్రీను నాయక్, బీఆర్ఎస్ తండా అధ్యక్షుడు బాబు నాయక్, మాజీ ఎంపీటీసీ సూర్య నాయక్, కిషన్ నాయక్, జీవులనాయక్ రాజ్య నాయక్, వినోద్ నాయక్, మోహన్ నాయక్, తరుణ్ నాయక్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖానలో ఆకస్మిక తనిఖీ

తూప్రాన్, ఫిబ్రవరి 21: మెదక్ జిల్లా తూప్రాన్ సామాజిక దవాఖానను తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలో అందుతున్న సేవలపై రోగులను అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం దవాఖాన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట దవాఖాన సూపరింటెండెంట్ అమర్ సింగ్, వైద్య సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్

# కమ్జు పిట్టల పెంపకంతో అధిక ఆదాయం

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి21: కమ్జు పిట్టల పెంపకంతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయ కోళ్లశాస్త్ర విభాగం కోర్సు డైరెక్టర్ ప్రొఫెసర్ కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయపల్లిలోని మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి వ్యవసాయ క్షేత్రంలోని కమ్జు పిట్టల పెంపకాన్ని పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ ప్రొఫెసర్లతో పాటు తమిళనాడు, కేరళ, అస్సాం, ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లోని వెటర్నరీ యూనివర్సిటీల ప్రొఫెసర్ల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణ, పౌల్ట్రీ రంగంపై దృష్టిని సారించాన్నారు. కమ్జు పిట్టల మాంసంలో అధికంగా మాంసకృతులు ఉంటాయన్నారు. అనంతరం రైతు, మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డిని ప్రొఫెసర్ల బృందం సన్మానించి, జ్ఞాపిక అందజేసింది. కార్యక్రమంలో పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ అధ్యాపకులు రాంబాబు, పరశురాములు, ప్రశాంత్, సురేశ్, శిరీష, స్థానిక పశువైద్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా నర్సాయపల్లిలో కమ్జు పిట్టల పెంపకాన్ని పరిశీలిస్తున్న ప్రొఫెసర్లు